

# ఎన్నారై ముచ్చట్లు

–సత్యం మందపాటి



## (గతసంచిక తరువాయి)

### 4. ‘స్వర్గానికి నిచ్చెనలేస్తాం!’

**నారద మహామునికి** ఆ రోజు ఏమీ తోచటం లేదు.

ఎవరికైనా తంపులు పెడదామనుకుంటే కనుచూపు మేరలో ఎవరూ కనపడలేదు.

ఇటు వైకుంఠానికి వెడితే, అక్కడ శ్రీమహావిష్ణువు ఆదిశేషు మీద పడుకుని మహానిద్రలో వున్నాడు. ఎలాగూ నిద్రపోతున్నాడు కదా అని, శ్రీమహాలక్ష్మి ఆయన కాళ్ళు వత్తటం మానేసి ఎక్కడికో వాహ్యాళికి వెళ్లినట్టుంది.

పద్మంలో పద్మాసనం వేసుకు కూర్చుని బ్రహ్మదేవుడు హడావిడిగా, ఆరోజు పుట్టబోయే వారికందరికీ జాతకాలు వ్రాస్తున్నాడు. నాలుగు తలలతో ఆలోచిస్తూ, ఎనిమిది చేతులతో చకాచకా వ్రాస్తున్నాడు. ఎప్పుడూ ఆయనకు దగ్గరగా తన్మయత్వంతో వీణ వాయిస్తూ కూర్చునే సరస్వతీదేవి మరెక్కడికి వెళ్ళిందో కానీ, అప్పుడు అక్కడ లేదు. బ్రహ్మగారి పనికి అడ్డం రావటం ఇష్టం లేక నారదుడు అక్కడినించీ కైలాసానికి వెళ్లాడు.

పరమశివుడు ఒక్కడే కొండ మీద ఒళ్ళు మరచి తాండవ నృత్యం చేస్తున్నాడు. అక్కడ కూడా ఆయన ఒక్కడే వున్నాడు. పార్వతీదేవి మరెక్కడికి వెళ్ళిందో కానీ, ఆ సమయంలో అక్కడలేదు.

ఇక ఎక్కడికి వెళ్ళాలో తెలియక నారదుడు, గమ్యం లేకుండా అలా మేఘాల మీద నడుస్తున్నాడు.

అప్పుడే ఎదురుగా వస్తున్న చిన్నమునిని చూసి ఆగాడు. చిన్నముని భూమ్మీద వున్నప్పుడు పెద్ద మునే కానీ, పైకి వచ్చేశాక అక్కడే ఎందరో మహామునులు వుండటం చేత చిన్నముని అనే అందరూ పిలుస్తున్నారు.

“మీరు వైకుంఠానికీ, కైలాసానికీ, బ్రహ్మగారి దగ్గరికీ వెళ్ళటం చూశాను. ముగ్గురమ్మలూ కలిసి అలా వాహ్యాళికి వెళ్ళినట్టున్నారు. ఇక త్రిమూర్తులు అవకాశం దొరికింది కదా అని ఎవరి పనుల్లో వారు మునిగిపోయారు. మీకు కాలక్షేపం చేయటానికి మరెలా?” అన్నాడు చిన్నముని, మనసులో ఈయన పనీ పాటా లేకుండా తిరుగున్నాడే అనుకుంటూ.

చిన్నముని మనసులోని మాటలని చదివేసిన నారదుడు, “అదేం లేదు. అలా స్వరకం వేపు వెడుతూ దారిలోనే కదా అని ఇలా వచ్చాను. అంతే” అన్నాడు సర్దుకుంటూ.

“అదేమిటి? స్వర్గం, నరకం అనేవి విన్నానుగానీ, స్వరకం అనేదెప్పుడూ వినలేదే!” అన్నాడు చిన్నముని.

“ఈమధ్యనే త్రిమూర్తులు ఆ రెండిటినీ కలిపేసి ఒకే చోట స్వరకాన్ని సృష్టించారు”

“మరి పుణ్యాలూ, పాపాలు చేసుకున్న వారు ఒకే చోటుకి ఎలా వస్తారు?” అడిగాడు చిన్నముని.

“దానికి మా విష్ణుమూర్తిగారు ఒక ఉపాయం చెప్పారులే. ఆనాడు రామావతారంలో లక్షణుడు గీసినట్టు ఒక పొడుగాటి గీత గీసి ఒక పక్క స్వర్గం, ఒక పక్క నరకం అన్నారు. ఒక పక్కనున్నవారు ఇంకొక పక్కకు వెళ్ళనీయదు ఆ లక్షణరేఖ. వారి ప్రవర్తనబట్టి, కర్మనిబట్టి, వారే తమతమ జీవితాలని ఇక్కడ స్వర్గమయం చేసుకోవచ్చు, నరకయాతన పడవచ్చు. దీనిని ఈమధ్యనే ఒక చిన్న ప్రయోగం కోసం సృష్టించారు. ఇటు స్వర్గంనించీ, అటు నరకంనించీ ఎంతోమందిని ఇక్కడికి తీసుకువచ్చారు. వారు ఈ స్వరకంలో ఎలా వున్నారో చూద్దామని వెడుతున్నాను!” అన్నాడు నారదుడు.

చిన్నముని చటుక్కున తలెత్తి వింతగా చూశాడు. “నాకూ అది చూడాలని వుంది. రావచ్చా?” అడిగాడు.

“అయితే నాతోపాటూ రా. ఇద్దరం కలిసే చూద్దాం. మనం వాళ్ళెవరికీ కనపడం. కానీ వాళ్ళని మనం చూడవచ్చు, వినవచ్చు“ అన్నాడు నారదుడు.

ముందుగా స్వర్గం వేపు వెళ్ళారు ఇద్దరు మునులూ. అక్కడ చక్కటి సరోవరం వుంది. మలయ మారుతం చల్లగా ముంగురులని తాకుతూ ఆహ్లాదంగా వుంది. సరోవరం చుట్టూ విరగబూసిన పూలమొక్కలతో మనోహరంగా వుంది.

అక్కడే శ్రీశ్రీగారు కూర్చుని తను వ్రాసిన ‘మరో ప్రపంచం.. మరో ప్రపంచం పిలిచింది’ అని ఆవేశంగా కవితాగానం చేస్తున్నారు. రావిశాస్త్రిగారు, కారాగారు, కొసరాజుగారు, ఆత్రేయగారు కూర్చుని ఆ కవితాగానాన్ని ఆస్వాదిస్తున్నారు.

పక్కనే భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, “ఇది మల్లెల వేళయనీ, ఇది వెన్నెల మాసమనీ..” అని ఇంకొక కవిత చదువుతుంటే, పక్కనే కూర్చున్న రంగారావుగారు, చంద్రమోహన్‌గారు కళ్ళు తుడుచుకుంటున్నారు.

కొంచెం దగ్గరే “మందార మకరంద మాధుర్యమును తేలు…“ అని తను వ్రాసిన మృదుమధుర పద్యకావ్యాన్ని ఆలాపిస్తున్నారు మధురకవి పోతన. కవిత్రయం, రాయలవారూ, ఆయన అష్టదిగ్గజాలు, శ్రీనాథ కవి సార్వభౌములూ తన్మయత్వంతో ఆ తేనెలూరు తెలుగు పద్యాలను ఆస్వాదిస్తున్నారు.

కరుణశ్రీగారు గులాబీ పూలమొక్కల దగ్గర కూర్చుండగా, ప్రక్కనే ఘంటసాల మాస్టారు “నేనొక పూల మొక్కకడ నిలిచి” అని అర్థవంతంగా పాడుతుంటే, అక్కడే సత్యాన్వేషణ చేస్తున్న బుద్ధదేవుడి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. పక్కనే కూర్చున్న జాషువాగారు ఆ కారుణ్యుడి దయార్ద్రతకు నమస్కారం చేశారు. తన ‘పాపాయి పద్యాలు’ వినిపిస్తే, పాపయ్యశాస్త్రిగారు లేచి వచ్చి, జాషువాగారిని కౌగలించుకుని హృదయానికి హత్తుకుంటున్నారు.

బుచ్చిబాబు, గోపీచంద్, కొడవటిగంటి, మధురాంతకం, తిలక్, భరద్వాజ మొదలైన గొప్ప సాహిత్యవేత్తలు భారతదేశంలోనే ఎంతో గొప్పదైన తీయని తెలుగు సాహిత్యాన్ని మధురస్మృతుల్లో తలుచుకుంటూ ఆనందిస్తున్నారు.

అక్కడే వున్న పచ్చగడ్డి మీద బాసింపట్టు వేసుకుని, ఒళ్ళో ఒక చెక్క పెట్టుకుని, ఎంతో అందమైన బొమ్మలు గీస్తున్నారు బాపుగారు. ఆయన పక్కనే గడ్డి మీద పడుకుని తను వ్రాసిన ఒక హాస్య కథను వినిపిస్తున్నారు బాపుగారి ప్రాణంలో సగం రమణగారు. ఆయన చుట్టూ రామలింగయ్యగారూ, కాంతారావుగారూ, మహాదేవన్‌గారు, ఆరుద్రగారు, సినారేగారు కూర్చుని, పొట్టలు చేతితో పట్టుకుని పెద్దగా నవ్వుతూ తమ సంతోషం ఆపుకోలేకపోతున్నారు.

చెట్టుక్రింద కూర్చున్న ఆత్రేయగారి మనసంతా ఆ సాహిత్య సౌరభాలతో పులకరించింది.

ఆ సరోవరం ఒడ్డునే, ఇంకోపక్క 'శివశంకరీ శివానందలహరి' అంటూ కంచుకంఠంతో మధురంగా పాడుతున్నారు ఘంటసాలవారు. ఆయన చుట్టూ కూర్చున్న పెండ్యాలగారు, మల్లాదిగారు, టీచలపతిరావుగారు, రాజేశ్వరరావుగారు, టీవీరాజుగారు, కోదండపాణిగారు, భానుమతిగారు, రాఘవులుగారు తన్మయత్వంతో కళ్ళు మూసుకుని తలలూపుతూ గాలిలో తేలిపోతున్నారు. కొందరి కళ్ళల్లో ఆ గంధర్వగానానికి ఉద్వేగంతో ఆనందభాష్పాలు తొణికిసలాడుతున్నాయి.

అలాగే ఇంకొక పక్క త్యాగరాజ కీర్తనలు శ్రావ్యంగా ఆలాపిస్తున్నారు బాలమురళీకృష్ణగారు. అక్కడ కూర్చున్న త్యాగరాజుగారు, క్షేత్రయ్యగారు, శ్యామశాస్త్రిగారు, అన్నమయ్యగారు, సుబ్బలక్ష్మిగారు, నేదునూరివారు, ఈమనివారు, చిట్టిబాబుగారు.. ఇలా ఎందరో మహానుభావులందరూ చేత్తో తాళం వేస్తూ, ఆ సంగీత సాగరంలో మునిగిపోయి వున్నారు.

అక్కడే పచ్చగడ్డి మీద శోభానాయుడుగారు, వెంపటి చిన్నసత్యంగారి నట్టువాంగానికి అనువుగా మృదుమెత్తని అందెల రవళితో కూచిపూడి నృత్యాన్ని చేస్తుంటే వెంపటి, పసుమర్తి కుటుంబ కూచిపూడి నృత్య కళాకారులు, ఇతర అపురూప నృత్య కళాకారులు తన్మయత్వంతో ఆనందిస్తున్నారు.

సరోవరానికి అవతలివైపు కొందరు చలనచిత్ర మహామహులు కూర్చుని, ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుకి తెచ్చుకుని మురిసిపోతున్నారు. రంగారావుగారు ఘటోత్కచుడి సంభాషణలు సరదాగా చెబుతుంటే, పక్కనేవున్న సావిత్రి, నాగేశ్వరరావు, రేలంగి, సూర్యకాంతం, రమణారెడ్డి, వంగర, పద్మనాభం, పింగళి, లీల, కె.వి.రెడ్డి, చక్రపాణి, నాగిరెడ్డి మొదలైనవారు ఒకళ్ళనొకళ్ళు చిరునవ్వుతో కళ్ళతోనే పలకరించుకుంటున్నారు. నటులు, దర్శకులు, నిర్మాతలు, సంగీత దర్శకులు, గాయకులు, రచయితలతో ఎంతో సరదాగా వుంది అక్కడ వాతావరణం.

"నాకింకో మంచి సినిమా తీయాలని వుందయ్యా. సంభాషణలు నువ్వే వ్రాయాలి" అంటున్నారు కాశీనాథుని విశ్వనాథ్‌గారు, పక్కనే కూర్చున్న జంధ్యాలతో. అక్కడే వున్న వేటూరి, సిరివెన్నెల, సినారె మేం పాటల వ్రాయటానికి సిద్ధం అన్నట్టు చూస్తున్నారు. ఆ పాటలు పాడటానికి మేము సిద్ధమే అంటున్నారు బాలుగారు, వాణీ జయరాంగారు.

"అయ్యా, మనమిప్పుడు భూమ్మీద లేము. స్వర్గంలో వున్నాం. ఇక్కడ సినిమాల్లాటివేవీ వుండవు. మళ్ళీ మీరే మొదలుపెడితే తప్ప" అన్నారు జంధ్యాలగారు నవ్వుతూ.

చిన్నముని ఎంతో గర్వంగా తల ఎగరేస్తూ, "తెలుగునాట చిత్ర, చలనచిత్ర, నృత్య, సంగీత, సాహిత్య కళలకు స్వర్ణ యుగం అది! అంత గొప్పరోజులు మళ్ళీ ఎప్పుడు వస్తాయో" అన్నాడు.

ఆ సరోవరం ఒడ్డునే ఇంకొక పక్క కొందరు కూర్చుని మాట్లాడుతుంటే, ఎంతోమంది నిశ్శబ్దంగా కూర్చుని వింటున్నారు. మధ్యమధ్యలో చప్పట్లు కొడుతున్నారు. ఆ మాట్లాడేవారంతా భారతదేశ స్వాతంత్ర సమరంలో దేశం కోసం ప్రాణాలర్పించిన మహానుభావులు. పరదేశీయులని ప్రాణాలొడ్డి ఎలా ఎదుర్కొన్నదీ టంగుటూరి ప్రకాశంగారు చెబుతుంటే, పట్టాభి సీతారామయ్యగారు, పింగళి వెంకయ్యగారు, వావిలాలగారు, అల్లూరి సీతారామరాజుగారు మొదలైనవారితోసహా, అక్కడ కూర్చున్న అందరికీ దేశభక్తితో ఒళ్ళు పులకరిస్తున్నది. కళ్ళు చెమర్చుతున్నాయి. కొంతమంది లేచి ఒకరి పాదాలకొకరు నమస్కారం చేస్తున్నారు. అలాగే దేశానికి స్వాతంత్రం వచ్చాక, ఎలా సరికొత్త దేశ నిర్మాణ కార్యక్రమంలో నిస్వార్ధంగా పాల్గొన్నారో తెలిసిన వారు, వారి పక్కన కూర్చుని వారి అనుభవాలు వింటున్నారు.

కొంచెం ఇవతలగా గురుకులంలా వున్నది. ఎంతోమందికి చదువులే కాక, జీవితంలోని విలువలతో సహా విద్యాదానం చేసిన గురువులు, వ్యక్తిత్వ వికాసంలో పాఠాలు చెబుతున్నారు. గురజాడగారు, వీరేశలింగంగారు, ఉన్నవ లక్ష్మీనారాయణగారు, గిడుగు రామ్మూర్తిగారు శ్రద్ధగా వింటున్నారు.

"పదండి ముందుకి.. ముందుకి వెడదాం" అన్నాడు చిన్నముని ముందుకి నడుస్తూ.

"ఇదిగో, ఇదే లక్ష్మణరేఖ. ఇది దాటి వెడుతున్నాం. మనకేమీ ఇబ్బంది వుండదులే. పద" అన్నాడు నారదుడు గీత దాటుతూ. అనుమానిస్తూనే జాగ్రత్తగా తనూ ఆ గీత దాటాడు చిన్నముని.

కొంచెం ముందుకి వెళ్ళి అక్కడే ఆగిపోయారు ఇద్దరూ.

అది పెద్ద అడవిలా వుంది. ఎన్నో చెట్లున్నాయి. కానీ చెట్లు ఎండిపోయాయి. ఆకులు రాలిపోయాయి. కొమ్మలు విరిగి క్రింద పడిపోయి వున్నాయి. నేల బీడువారిపోయింది. గాలి స్థంభించింది. నీరు ఇంకిపోయింది.

"ఇదేమిటి.. ఇక్కడ ఇలా వుంది.." అడిగాడు చిన్నముని.

"ఇందాక మనం చూసిన ప్రదేశంలాగానే వుండేది ఇది కూడా. అక్కడ వాళ్ళు అందమైన నందనోద్యానవనంలా మార్చుకుని, స్వర్గతుల్యం చేసుకుని, కళామయ జీవితం గడుపుతూ ఆనందిస్తున్నారు. ఇక్కడున్న వారు స్వార్ధంతో, అసూయా ద్వేషాలతో, దురాశలతో, ఇలా భూమి కబ్జాలు, దొంగతనాలు, దోపిడీలు, హత్యలతో... దీన్ని పూర్తిగా మార్చేసి ఇలా చేసుకుంటున్నారు. కొంచెం ముందుకు వెడితే నీకే తెలుస్తుంది. పద" నారదుడు ముందుకు నడుస్తూ అన్నాడు.

అక్కడ ఒక మోడువారిన చెట్టు క్రింద ఎండ ఎక్కువగా వుంది. ఎంతోమంది మనుష్యులు కూర్చుని, నుంచుని, వంగుని, పడుకుని.. వారి ఒళ్ళంతా గోక్కుంటున్నారు. కొందరికయితే గోకిన చోటల్లా రక్తం కారుతున్నది. ఆ రక్తం, చీమూ వున్నచోట ఈగలూ, దోమలూ వాలుతున్నాయి. కొందరికి ఒళ్ళంతా వాచిపోయి అసహ్యంగా వుంది. అక్కడ ఒక రకమైన దుర్వాసన కూడా వేస్తున్నది. అది చూడలేక చిన్నముని గబగబా ముందుకు నడిచాడు.

"ఏమిటి, ఇక్కడ ఇలా వుంది?" అడిగాడు చిన్నముని ముక్కు మూసుకుంటూ.

నారదుడు, "ఇదేమిటో నాకు తెలుసు! ఇప్పుడు భారతదేశంలో, ముఖ్యంగా దక్షిణాదిన వున్న రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కులగజ్జి ఎక్కువగా వుంది. ఇదా కులగజ్జి ప్రభావమే. కొన్ని కులాల్లో బాగా ఎక్కువ, కొన్ని కులాల్లో తక్కువ. ఎక్కువ గజ్జి వున్నవాళ్ళు ఎక్కువగా గోక్కోవటం వల్ల, అలా చీమూ నెత్తురూ వారి శరీరం మీద వున్న అన్ని అవయవాల మీదా కారుతున్నాయి. ఎంత గజ్జికి, అంత గోకుడు! అదే ఈ కంపుకి కూడా కారణం. వీరిలో కొంతమందికి కులం పేరుతో అర్హత లేకపోయినా అన్నిచోట్లా ముందు బెంచీలో కూర్చోబెడుతున్నారు శ్రీప్రభుత్వం వారు. అక్కడ పై అంతస్తులో కూర్చున్న వాళ్ళతో సహా ఈ కులగజ్జి వర్గం వారు, బాధ్యతలు మరచిపోయి ఈ గోకుడు వ్యాపారంలో మునిగిపోయారు"

"అదేమిటి వీళ్ళ తెలుగు భాష కూడా వింతగా వుంది. తెలుగు రాదా? మరి చదువూ సంధ్యలు వాళ్ళకి తీయనైన తెలుగు, మంచి సంస్కారం ఇవ్వలేదా?"

"అదంతే! మిగతా భాషా రాష్ట్రాలలో లేని ఈ భాషా సమస్య ఒక్క తెలుగునాటే వుంది. తెలుగు దేశంలో తెలుగు ఎందుకు నేర్చుకోవాలి అనే తెగులుతో ప్రశ్నిస్తున్న రోజులివి. మాతృభాషని మరచిపోతున్న సంస్కృతి అది. చదువులా? ఆరోజుల్లో పిల్లలు చదువుకునేవారు. చదువులు అమ్మకానికి పెట్టాక ఇప్పుడు చదువు'కొంటున్నారు'! సంస్కారం ఇంకా అమ్మకానికి పెట్టలేదు. అయినా నీకు తెలియనిదేముంది. ఈమధ్యనే కదా భూమినించీ వచ్చావు" అన్నాడు నారదుడు.

"నేను ఎన్నో ఏళ్ళు హిమాలయాల్లో తపస్సు చేసుకుని వచ్చాను. అందుకే నా చుట్టూతా ఏం జరుగుతున్నదో కూడా కళ్ళు తెరిచి చూడలేదు. అది నా తప్పే!", తల వంచుకుని ముందుకు నడిచాడు చిన్నముని.

నారదుడు మనసులో అనుకున్నాడు, "చాలమందిప్పుడు అలాగే కళ్ళు మూసుకునే వున్నారు. వారికిప్పుడు సమాజం అఖ్కర్లేదు. వృద్ధాప్యంలోని తల్లిదండ్రులు అఖ్కర్లేదు. డబ్బు ఒక్కటే కావాలి. కానీ చనిపోయాక మోక్షం కావాలిట. అంతా స్వార్థమే!" అని.

ఎదురుగా చూస్తూ, "వాళ్లెవరు, అక్కడ గోతులు తవ్వుతున్నారు?" అడిగాడు చిన్నముని.

"ఆ బట్టలు చూశావుగా? ఖద్దరు బట్టలు, ధవళ వస్త్రాలు, కాషాయ పీతాంబరాలూ, పసుపు శాలువాలూ... ఏ సమయానికి ఆ వేషం, ఏ ఎండకి ఆ గొడుగూ పట్టే నీచులు వాళ్ళు. రాజకీయ నాయకులు. భారతదేశానికి ఇతర దేశాల నించీ విముక్తి వచ్చినా, వీరి పీడ ఇంకా వదల్లేదు. ప్రజలని నిలువుదోపిడీ చేసి బస్తాలకు బస్తాలు డబ్బు, ఎక్కడ దొరికితే అక్కడ స్థలాలు, పెట్టెల నిండా బంగారం, వజ్రాలు... అదో అంతులేని కథ అనుకో. అవన్నీ తీసుకుని 'పైకి' రావాలని బయల్దేరితే, యమధర్మరాజుగారు సామాన్లు తీసుకురావటానికి తన దున్నపోతు మీద ఇంకేమీ ఖాళీలేదని, బస్తాలు తీసుకువస్తుంటే అడ్డంపెట్టాడని ఏడుస్తున్నారు. ఆ దోపిడీ ధనం అంతా అక్కడే వాళ్ళ కొడుకులకీ, అల్లుళ్ళకీ, కూతుళ్ళకీ, వాళ్ళని మోసం చేసిన బాబులకీ ఇచ్చేసి చేతులూపుకుంటూ వచ్చారు. భవిష్యత్తులోనైనా ఇక్కడకి వచ్చేటప్పుడు, బస్తాలకి బస్తాల లగేజీ తీసుకురానిస్తారని ఆశ. అవి దాచుకోవటానికే, ఏనాటికైనా యమధర్మరాజు మారతాడేమోననే ఆశతో ఆ

గోతులు తవ్వుకుంటున్నారు. కొందరు స్వార్థపరులు ఎవరూ చూడకుండా ఎవరు తవ్వుకున్న గోతుల్లో వాళ్లనే పూడ్చి పెడుతున్నారనుకో!" అన్నాడు నారదుడు.

"మరి వారి వెనుక కూర్చున్న వాళ్ళు ఎవరూ.. "

"ఒకరనేముంది అంతా అదే జాతివాళ్ళు. లంచాలు తినే ప్రభుత్వోద్యోగులు, కల్తీ వ్యాపారులు, భారతదేశంలోనే వుంటూ భరతమాతని మటుమార్చాలని ప్రయత్నించే ఉగ్రవాదులు, మతం పేరుతో వ్యాపారం చేసే దొంగ పాస్టర్లూ, బాబాలూ, స్వాములూ, ముల్లాలూ, అవకాశవాదులూ.. ఇక్కడ కులాల, మతాల ప్రసక్తి లేదు. ఇలా ఒకరేమిటి అందరూ ఒకటే. డబ్బు ఒక్కటే వాళ్ళకి ముఖ్యం. వీళ్ళు మనుష్యులుగా పుట్టినందుకు ఒక్కరోజైనా మనుష్యులుగా జీవించని దుర్మార్గులు."

"మరి అక్కడ ఎండిపోయిన గోతుల్లో మిగిలిన ఆ మురికి నీళ్ళు తాగటానికి వెతుకుతున్నదెవరు?"

"వాళ్ళా? ఒక రకం ఏమిటి.. ఎన్నో రకాల నరకాసురులు. మానభంగాలు చేసి, ఆడపిల్లల్ని హత్య చేసిన వాళ్ళు. ప్రేమంటూ చదువుకునే పిల్లల ముఖాల మీద రసాయన ఆమ్లాలు పోసినవారు. పీకల దాకా పీపాలతో మాదక ద్రవ్యాలు నింపేవాళ్ళూ, బూతు సినిమాలు, బొద్దు సినిమాలు, హింసాత్మక చిత్రాలూ తీసి యువతని తప్పు దారి పట్టించే వాళ్ళు. వాటి ప్రభావంతో మానవత్వపు విలువలూ, సాంస్కృతిక విలువలూ, సాంఘిక విలువలూ కోల్పోతున్న ఈ తరం యువతీ యువకులూ.. అన్ని రకాల వాళ్ళూనూ" అన్నాడు నారదుడు.

భయభ్రాంతులతో నోరు తెరుచుకుని చూస్తున్నాడు చిన్నముని,

"ఇంతకుముందు స్వర్గం, నరకం అని వేరు వేరుగా వుండేవి. ఈ ప్రపంచం చూస్తుంటే, 'స్వర్గం నరకం అని వేరే వుండవు, అవి మానవుల స్వయంసృష్టి మాత్రమే' అనిపిస్తుంది. మానవ స్వభావాలు, ప్రవర్తనన, ద్వేషం, మోసం, స్వార్థం, ఈసునసూయలనుబట్టి వాళ్ళే వారి జీవితాలనీ, వారి ఎదుటివారి జీవితాలనీ స్వర్గంమయం చేసుకోవటం లేదా నరకభూయిష్టం చేసుకోవటం వారి చేతుల్లోనే వుంటుందనిపిస్తుంది. స్వర్గం, నరకాల కోసం 'పైకే' రానఖ్ఖరలేదు. ప్రతి ఇంట్లోనూ, ప్రతి వూళ్ళోనూ, ప్రతి దేశంలోనూ, ప్రతి మతంలోనూ ఆ రెండూ వున్నాయి. వుంటాయి. ఇలా కాకుండా అంతా స్వర్గమయమయే రోజు వస్తుందా?" అడిగాడు చిన్నముని.

"ఎందుకు రాదు.., బ్రహ్మగారు ఇకనైనా నిదానంగా మనుష్యుల జీవితాల జాతకాలు సరిగ్గా రాస్తే సరి" నారదుడు అనుకోకూడదని అనుకుంటూనే అనుకున్నాడు. అనుకుని వెంటనే నాలిక కొరుక్కున్నాడు.

వెనక్కి తిరిగి వస్తుంటే, స్వర్గం వున్న వైపున ఒకచోట ఎంతోమంది గుమికూడి వున్నారు.

చిన్నముని కుతూహలంతో అటు వెడుతుంటే, నారదుడు కూడా అతని వెనకనే వెళ్ళాడు.

అక్కడ మహానటి సావిత్రి చిరునవ్వుతో నృత్యం చేస్తున్నది. పి. పుల్లయ్యగారు, ఘంటసాలగారు, గురజాడగారు, గుమ్మడిగారు, గోవిందరాజుల సుబ్బారావుగారు, సియ్యస్సార్‌గారు కూర్చుని వున్నారు. శ్రీశ్రీగారు తను వ్రాసిన పాటని తనే శ్రావ్యంగా పాడుతున్నారు.

“ఆనందం అర్ణవమైతే, అనురాగం అంబరమైతే
అనురాగపుటంచులు చూస్తాం, ఆనందపు లోతులు తీస్తాం
నీ కంకణ నిక్వాణంలో, నా జీవన నిర్వాణంలో
మరణానికి ప్రాణం పోస్తాం, స్వర్గానికి నిచ్చెన వేస్తాం” అంటూ.

*(మరో ముచ్చట వచ్చే నెలలో)*

COMMENTS